క్లుప్తంగా

సమయపాలన తప్పనిసరి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలోని సంకాడ, రింతాడలోని గ్రామ సచివాలయాలను ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తనిఖీ చేశారు. హౌస్ ఓల్డ్ సర్వే, మ్యాపింగ్‌తో పాటు ఎన్‌పీసీఎల్, స్వర్ణ పంచాయతీలకు సంబంధించిన అంశాలపై సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

హుకుంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో సోమేలి చెల్లయ్యయ్య ఉపాధ్యాయులకు ఆదేశించారు. మండలంలోని మత్స్యపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు శ్రద్ధ కలిగి పాఠాలు బోధించాలన్నారు. హెచ్‌ఎంలు ఎం.సత్యరావు, తాడం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిబేట్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం డిబేట్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ డిసెంబర్ 1న ఎయిడ్స్ డే పురస్కరించుకొని రెడ్ రిబ్బన్ క్లబ్ కమిషనరేట్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. పోటీల్లో కళాశాలకు చెందిన 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పసుపులేటి నాగబాబు, వై.విజయలక్ష్మీ, మొష్యా అనిత కుమారి, అధ్యాపకులు సుందరిరాణి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న తాటాకిల్లు

కొయ్యూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చింతలపూడికి చెందిన చిన్ని నూకరాజుకు చెందిన తాటాకుల ఇల్లు పూర్తిగా కాలిపోయింది. నూకరాజు ఇంటి నుంచి సోమవారం సాయంత్రం ఆకస్మాత్తుగా మంటలు వచ్చాయి. కుటుంబ సభ్యులు భయంతో పరుగులు తీశారు. మంటలపు ఆర్పేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. మంటలు ఒక్కపూర్తిగా వ్యాపించి తక్కువ సమయంలో ఇల్లు మొత్తం కాలిపోయింది.బాధిత కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.మూడు లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధితుడు నూకరాజు తెలిపారు.

వాహనాల తనిఖీలు



గంగవరంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గంగవరం : ఎమ్మెల్యే ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిఘా బృందాలు, పోలీసులు మండలంలో సోమవారం విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ఎన్నికల కమిషన్ నిఘా అధికారులు మండల వ్యవసాయాధికారి కె. విశ్వనాథ్ ఆధ్వర్యంలో గంగవరం ఏఎస్ఐ సూర్యనారాయణ, పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీలు చేశారు.

గిట్టుబాటు లేక కుంగుబాటు



వారపు సంతలో విక్రయిస్తున్న నాణ్యత లేని వస్తువులు

- వారపు సంతల్లో సిండికేట్‌లదే హవా
- పంటలకు కనీస ధరల కరువు
- ఆందోళనలో రైతులు

అరకులోయటౌన్: గిరిరైతులు అడవి నుంచి సేకరించే అటవీ ఫలసాయంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక తీవ్ర నష్టపోతున్నారు. గిరిరైతులు పండించే కూరగాయల దగ్గర నుంచి వాణిజ్య పంటలను వారపు సంతలకు తీసుకొచ్చి విక్రయాలు జరుపుతుంటారు. అయితే సంతల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను మోసగిస్తున్నారు. గిరి రైతులకు అవసరమైన నిత్యావసర సరకులైన పప్పులు, ఉప్పు, నూనెలు, సబ్బులు, ఇతర వస్తువులు నాణ్యత లేకపోయినప్పటికీ వ్యాపారులు నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేసి గిరిజనులు మోసపూతున్నారు.

వ్యాపారులు నిర్ణయించిన ధరలకే విక్రయాలు

రైతులకు సంతలకు తీసుకొచ్చిన పంటలకు మాత్రం గిట్టుబాటు ధరలు లభించడం లేదు. సిండికేట్‌గా మారిన వ్యాపారులు నిర్ణయించిన ధరలకే విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. నియోజకవర్గం పరిధిలో ఆరు మండలాల్లో ప్రతీ రోజు ఏదో ఒక ప్రాంతంలో సంత జరుగుతోంది. వారపు సంతల్లో విక్రయించేందుకు తీసుకుచ్చే కూరగాయలు, వాణిజ్యపంటలను దళారులు నిర్ణయించిన ధరలకు తప్పనిసరి పరిస్థితుల్లో గిరిజన రైతులు విక్రయాలు చేయాల్సి వస్తోంది. సరకులను తిరిగి ఇళ్లకు తీసుకెళ్ల లేక తక్కువ ధరలకే విక్రయించి వెనుదిరుగుతున్నారు. సుంకరమెట్ట, అరకు సంతబయలు తదితర వారపు సంతల్లో తీసుకువచ్చిన కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలైన సామలు, రాగులకు కనీస ధర లభించక గిరిరైతులు వాటిని వ్యాపారులు నిర్ణయించిన ధరలకే విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. గత వారం 40 కిలోల వంకాయలు రూ. 2వేలకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఈ వారం కేవలం రూ. 1000లకే కొనుగోలు చేశారు. రాగులు-రూ.20, సామలు -35లకే కొనుగోలు చేశారు. గొర్రెలు, మేకలకు వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తుందని గిరిజనులు వాపోతున్నారు. పాడేరు ఐటీడీఏ అధికారులు స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలని గిరి రైతులు కోరుతున్నారు.



వారపు సంతలో విక్రయించేందుకు తీసుకువచ్చిన వంకాయలు

నష్టపోతున్నాం

అతికష్టంతో సేకరించిన అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులను సంతల్లో విక్రయిస్తున్నాం. వచ్చిన లాభాలతో కుటుంబంతో జీనవం సాగిస్తున్నాం. సంతల్లో వ్యాపారులు సిండికేట్‌గా మారి అతి తక్కువ ధరలకు వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. సరకులను వెనక్కి గ్రామాలకు తీసుకెళ్లలేక, తప్పని పరిస్థితుల్లో వ్యాపారులు నిర్ణయించిన తక్కువ ధరలకే విక్రయించుకోవాల్సి వస్తోంది. కనీసం చార్జీలు రావడం లేదు, గిట్టుబాటు ధరలు ఉండడం లేదు. ఐటీడీఏ అధికారులు స్పందించి అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి మాలాంటి గిరిజన రైతులు ఆదుకోవాలని కోరుతున్నాం.

– అర్జున్, రైతు, అరకులోయ టౌన్

భక్తిశ్రద్ధలతో పడిపూజ



గంగవరం రామాలయంలో అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న భక్తులు

గంగవరం: స్థానిక రామాలయం వద్ద గురుస్వామి శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాగేశ్వరరావు, సతీష్, బాబ్జి, చక్రి. మహేంద్ర స్వాములు తదితరులు అరటిదొవ్వలతో నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయ నమూనా ఆకట్టుకుంది.

సీలేరు: సీలేరులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద గురుస్వామి రమేష్ ఆధ్వర్యంలో పడిపూజ ఘనంగా నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెదబయలు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్థానిక ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు అన్నారు. సోమవారం పెదబయలు వారపు సంతలో వ్యాపార దుకాణాలను పరిశీలించారు. వ్యాపారులు అమ్మకానికి తెచ్చిన వస్తువులను పాలిథిన్ కవర్లలో ప్యాకింగ్ చేసి ఉండడంపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. వారపు సంతల్లో ఎక్కువగా పాలిథిన్ కవర్ల వినియోగం జరుగుతుందన్నారు. పాలిథిన్ కవర్లలో విక్రయించొద్దని ఆదేశించారు. ప్రజలు సంతకు, ఇతర దుకాణాలకు వెళ్లినప్పుడు నారా, వస్త్ర సంచులు తీసుకుని వెళ్లాలని సూచించారు. పాలిథిన్ వినియోగాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. వారపు సంతలో డండోర వేసి ప్రజలకు అవగాహన కల్పించారు. వీఆర్వో ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.



వారపు సంతలో ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు

ద్వారపూడికి కాలినడకన అయ్యప్ప మాలధారులు

గంగవరం : మండలంలోని పాత గంగవరానికి చెందిన పది మంది అయ్యప్ప మాలధారులు కాలినడకన ద్వారపూడి అయ్యప్పస్వామి ఆలయానికి సోమవారం పయనమయ్యారు. గురుస్వామి వై.రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో బయలుదేరిన అయ్యప్ప మాలధారులు గంగవరం నుంచి గోకవరం, కోరుకొండ, రాజానగరం మీదుగా వీరు ద్వారపూడి చేరుకోనున్నారు. పాత గంగవరం శ్రీ రామాలయంలో ఇరుముడులు కార్యక్రమాన్ని పూర్తి చేసి పయనమయ్యారు.



ద్వారపూడి ఆలయానికి కాలినడకను వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ చిత్తమ్ గ్రామంలో సోమవారం ఎంపీడీవో శ్రీసాయిహర్షతో పాటు మండల స్థాయి అధికారులు పర్యటించారు. ఇటీవల చిత్తమ్ గ్రామంలో ఎటువంటి గుర్తింపు కార్డులు లేక, మౌలిక సదుపాయాలు కరువై అవస్థలు పడుతున్నారని పత్రికల్లో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో మండల అధికారులు ప్రయాసాలు పడి గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేషన్, ఆధార్ కార్డులు లేని వారందరికీ కార్డులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని, గ్రామంలో రహదారి, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని గ్రామస్తులకు ఎంపీడీవో శ్రీసాయిహర్ష చెప్పారు. అనంతరం కుటుంబాల వారీగా వివరాలను సేకరించారు. సర్పంచ్ గంగాధర్, ఏపీవో సంగంనాయుడు, ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న తదితరులు పాల్గొన్నారు.



చిత్తమ్ గ్రామ గిరిజనులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష



కొయ్యూరులో పూజలు చేస్తున్న భక్తులు



నందిగామలో సామూహిక వత్రాలు చేస్తున్న భక్తులు

మార్మోగిన శివ నామస్మరణ



సాలభంలో పూజలు చేస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు

హుకుంపేట/జి.మాడుగుల/కొయ్యూరు/ఎటపాక/అడ్డతీగల/వై.రాయవరం: కార్తీక మాసం నాలుగవ సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే నదీ స్నానాలు ఆచరించి, భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ధ్వజస్తంభాల వద్ద పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయాల ఎదుట ఉన్న జలపాతాల్లో వందలాది మంది మహిళలు కార్తీక దీపాలు వదిలి, శివున్ని దర్శించుకున్నారు. ఆలయాలు సాధారణ భక్తులతో పాటు అయ్యప్పస్వామి, సత్యదేవ, భవాని, శివ మాలధారులతో కళకళలాడాయి. గ్రామాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. హుకుంపేటలో ప్రముఖ పుణ్యక్షేత్రం,ఆధ్యాత్మిక కేంద్రాం మత్స్యగుండంలో భక్తులు భారీగా తరలివచ్చారు. మత్స్యగెడ్డలో పుణ్యస్నానాలు చేసి మత్స్యలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు స్థానిక సర్పంచ్ మఠం శాంతకుమారి, హుకుంపేట సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమలు ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. జి.మాడుగుల మండలంలోని సొలభం, జి.మాడుగుల సంతబయలు, బందవీధి, వంతాల, గెమ్మెలి, వంజరి, సంగులోయ, చినకొత్తూరు తదితర గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొయ్యూరు మండల కేంద్రంలోని భ్రమరాంభిక సమేత మల్లిఖార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎటపాక మండలంలోని బుట్టాయిగూడెం, వెంకటరెడ్డిపేట,గన్నవరం శివాలయాల్లో దీపారాధన నిర్వహించారు. నందిగామలోని సామూహిక వీర వెంకటసత్యనారాయణస్వామి వ్రతాలు వైభవంగా జరిగాయి. అడ్డతీగలలోని సోమాలమ్మ తల్లి ఆలయం చెంతనే కార్తీక దీపోత్సవం కనుల పండువగా జరిగింది. వై.రామవరం: మండలంలోని పూతిగుంట పరమేశ్వరుని, గురమంద విశ్వనాధుని ఆల యాల్లో కార్తీకసోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు.



అడ్డతీగలలో దీపారాధన



పూతిగుంట పరమేశ్వరుని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా వనసమారాధన



పనసలపాలెం గ్రామ అంజనేయస్వామి ఆలయం వద్ద వనభోజనాలు చేస్తున్న గ్రామస్తులు

వై.రామవరం: కార్తీక మాసం పురస్కరించుకుని మండలంలోని పనసలపాలెంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులతో పాటు ఎస్‌బీఐ రిటైర్డు మేనేజరు పల్లాల లింగారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

వై.రామవరం: అసాంఘిక కార్యకలాపాల జోలికి పోవద్దని అడ్డతీగల సిఐ బి నరసింహమూర్తి స్థానికు గిరిజనులకు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక వారపు సంతలో మండల లోతట్టు ప్రాంత ప్రజలకు సిఐ నరసింహమూర్తి సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, విక్రయాలు చట్ట రీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమించొద్దన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హితవుపలికారు. రోడ్డు ప్రమాదాల నివారణకు యువత సహకరించాలన్నారు. విద్యుత్ తీగలలో అడవి జంతువులు వేటాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడిపందాలు, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ బి.రామకృష్ణ , సిబ్బంది పాల్గొన్నారు.



వారపు సంతలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరసింహమూర్తి

అరకు ఎమ్మెల్యే పరామర్శ



ముఖీ సోదరులను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: మండలంలోని పద్మాపురం పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు ముఖీ పెద్ద సాంబయ్య, చిన్న సాంబయ్యలకు చెందిన తల్లి ముఖీ సీతమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం రాజధాని జంక్షన్‌లోని వారి స్వగృహానికి చేరుకొని సీతమ్మ కుమారులు, వైఎస్సార్‌సీపీ నాయకులైన ముఖీ పెద్ద సాంభయ్య, చిన సాంభయ్యలను పరామర్శించి, ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం

ఎటపాక: కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఐద్వా మండల కార్యదర్శి ఐ.పద్మ విమర్శించారు. మండల కేంద్రంలోని గుండాల గ్రామం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం, డ్రగ్స్ ఉన్నాయని, వాటిని నివారించాలని డిమాండ్ చేశారు. రోజు రోజుకు మహిళలు, చిన్నారులు, విద్యార్థినులపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయులు రమాదేవి, జ్యోతి, మహిళా సంఘం నాయకులు సుమిత్ర, సావిత్రమ్మ, చిట్టెమ్మ, శాంతి, రాధ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, మహిళలు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గూడెంకొత్తవీధి: మండలంలోని పలు అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ కిముడు శివరత్నం సోమవారం శంకుస్థాపన చేశారు. సంకాడ పంచాయతీలోని గోవాడ గ్రామంలో రూ. 2లక్షల వ్యయంతో 50 మీటర్ల సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. డింగిరాయి గ్రామంలో రూ.6లక్షల వ్యయంతో రక్షిత తాగునీటి పథకం పనులను ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు, వైస్ ఎంపీపీ లోతాదేముడు, సర్పంచ్ నాగులమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఉప సర్పంచ్ భీమరాజు, వార్డు సభ్యులు రాంబాబు, నాయకులు రామకృష్ణ, ఈశ్వరరావు, రాజుబాబు, గంగరాజు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ శివరత్నం

నేడు వైద్య శిబిరం

సీలేరు: స్థానిక ఏపీ జెన్‌కో కల్యాణమండపంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించనున్న వైద్య శిబిరంలో న్యూరో సర్జన్ డాక్టర్ లక్ష్మణరావు వైద్య పరీక్షలు చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విశాఖ జిల్లా ఆనందపురం ప్రాంతానికి చెందిన రాయల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో స్థానిక ఏపీ జెన్‌కో ఉద్యోగి నానాజీ సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రంపచోడవరం: సాంకేతికత పెరిగిన తరుణంలో సైబర్ నేరాలు బాగా పెరిగిపోతున్నాయని, సైబర్ నేరాలపై పూర్తిస్థాయి అవగాహన అవసరమని రంపచోడవరం ఎస్ఐ సాధిక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది సైబర్ నేరగాళ్ల వలలో పడి డబ్బులును పొగొట్టుకుంటున్నారపాకపరు. ఎవరైనా అనధికారికంగా ఫోన్ చేసి బ్యాంకుఖాతా వివరాలు, ఓటీపీలు ఇతరత్రా వ్యక్తిగత సమాచారం అడిగినా తెలియజేయవద్దన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాధిక్

వేద పాఠశాల ప్రారంభం



హోమంలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి: మండలంలోని చెరుకుంపాకలలో వేద పాఠశాలను సోమవారం ప్రారంభించారు. నర్సీపట్నం గురువులు సుంకర భాస్కరరావు ఆధ్వర్యంలో ఈ పాఠశాల ప్రారంభ కార్యక్రమం జరిగింది. వేద పఠనం, పారాయనాలు బోధన జరుగుతుందన్నారు. లోతుగెడ్డ పంచాయతీ పరిధిలో గల చెరుకుంపాకలు జంక్షన్‌లో ఈ సందర్భంగా 40 జంటలతో హోమ కార్యక్రమాన్ని చేపట్టారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరుకు జరిపించారు. ఎంఈవో పనసల ప్రసాద్, మల్లు పడాల్, అప్పన్నదొర, కృష్ణపడాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

అనంతగిరి (అరకులోయ టౌన్): విద్యార్థులకు మంచి విద్యతోపాటు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు పట్టిక, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, హోం వర్క్ పుస్తకాలను పరిశీలించారు. విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం, కాచిన తాగునీటిని అందజేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.



రికార్డులు పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం